ఈనాడు
జోగులాంబ గద్వాల
సోమవారం అక్టోబరు 21, 2024 5

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే పైరవీలు అవసరం లేదు

ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి

వనపర్తి పట్టణం: యువతీ యువకులు చాలా మంది యువత ఉన్నత స్థాయికి చేరాలంటే పైరవీలు చేయాలన్న అపోహతో ఉన్నారని, దీన్నుంచి బయటపడాలని ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి అన్నారు. పనినే నమ్ముకుని ఉన్నత స్థాయికి చేరవచ్చనేందుకు తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన ఆదివారం తొలిసారిగా పాలమూరు గడ్డకు వచ్చారు. పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన ఈయన తన కుటుంబ సభ్యుడు చల్లా విజయ్‌కుమార్ వనపర్తి పాత గంజి లక్ష్మీణపతి ఆలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. సీఎస్ఆర్ నిధులతో వనపర్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. గట్టు మండలానికి కేటాయించిన ఎస్బీఐ సంజీవని క్లినిక్ అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఎంపీ మల్లు రవి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేశ్ రెడ్డి, కలెక్టర్లు ఆదర్శ్ సురభి, బీఎం సంతోష్, బదావత్ సంతోష్ కుమార్ శ్రీనివాసులు శెట్టిని ఘనంగా సన్మానించారు.



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి దంపతులు. చిత్రంలో ఎంపీ మల్లురవి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

విద్యార్థులకు అపార్ కార్డు

- అందులోనే సమగ్ర సమాచారం
- తల్లిదండ్రుల అంగీకారపత్రం తీసుకోవాలని ఆదేశాలు


అమరవాయి ఉన్నత పాఠశాలలో అపార్ కార్డుల కోసం ఇస్తున్న అంగీకార పత్రాలతో తల్లిదండ్రులు

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్

జాతీయ విద్యా విధానంలో భాగంగా 'ఒక దేశం - ఒక విద్యార్థి ఐడీ' నినాదంతో కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేక కార్డు అందించనుంది. అపార్(ఏపీఏఏఆర్ - ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పేరుతో ఆ కార్డును అందించేందుకు గతేడాది ఆదేశాలు వచ్చినా రాష్ట్రంలో అమలు కాలేదు. తాజాగా తిరిగి ఆదేశాలు రావడంతో శనివారం నిర్వహించిన పీటీఎం(తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం)లో దీనిపై అవగాహన కల్పించారు. ఆధార్ తరహాలో దేశంలోని ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఒక ఐడీ సంఖ్యను కేటాయించనున్నారు.



అపార్ వెబ్‌సైట్ ముఖచిత్రం

తల్లిదండ్రుల అంగీకారం తోనే..: అపార్ కార్డు వివరాలు గోప్యంగా ఉంచుతామని కేంద్రం చెబుతోంది. తల్లిదండ్రుల అంగీకారం తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే చాలా మంది తల్లిదండ్రులు దరఖాస్తులు చేశారు. విద్యార్థి ఆధార్, బోనఫైడ్ వివరాలు అక్షరం తప్పులేకుండా ఉంటేనే అపార్ సంఖ్య జనరేట్ అవుతుంది. ఒకసారి కార్డు వచ్చిందంటే మార్పులకు అవకాశం ఉండదు.

ఉమ్మడి జిల్లాలో..: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 నియోజకవర్గాల పరిధిలో 4,800కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. 250కి పైగా ఇంటర్, డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో సుమారు 6.10 లక్షల మందికి పైగా విద్యార్థులు పూర్వ ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు చదువుతున్నారు. ఇప్పటివరకు పిల్లలకు పాఠశాల స్థాయిలో, కళాశాల స్థాయిలో వేర్వేరు ఐడీలు కేటాయించేవారు. అపార్ ఐడీ కార్డు వస్తే ఒకే కార్డులోనే సకల సమాచారం ఉంటుంది.

జీవితకాల ఐడీగా: 12 అంకెల సంఖ్య విద్యార్థి జీవితకాల ఐడీగా పరిగణిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులందరికీ కేటాయిస్తారు. ఇందులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, కేజీ టూ పీజీ విద్యా సంవత్సరం వివరాలు, సాధించిన విజయాలు, స్కాలర్‌షిప్‌లు, మెమోలు, ధ్రువపత్రాలు, ఆధార్ అనుసంధానం ఉండటంతో కుటుంబ వివరాలు పొందుపరుస్తారు. విద్యార్థి ఖాతా డిజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. దీంతో విద్యా సంస్థల ప్రవేశాలు, ప్రవేశ పరీక్షలకు, ఉద్యోగాలకు విద్యార్థి ఐడీ నమోదు చేస్తే అన్ని వివరాలు తెలుసుకోవడం సులువవుతుంది.

భవిష్యత్తులో కీలకం: అపార్ కార్డు విద్యార్థులకు కీలకం. ఇందుకు తల్లిదండ్రుల అనుమతి పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించాం. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది.

-హంపయ్య, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల

11 మంది జీహెచ్‌ఎంలపై వేటు..?

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు పాఠశాలలు, మండలాలకు ఎంఈవోలుగా పనిచేస్తున్న 11 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు(జీహెచ్‌ఎంలు) సస్పెన్షన్‌కు గురైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రాంతీయ పాఠశాల విద్యా సంచాలకులు విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. గతేడాది జిల్లాలో జరిగిన జీహెచ్‌ఎంల బదిలీల్లో దాదాపు 60 మంది వివిధ పాఠశాలలకు వెళ్లారు. అందులో 18 మంది జీహెచ్‌ఎంలు స్పౌస్ విభాగంలో వివిధ పాఠశాలలకు బదిలీ అయ్యారు. అందులో 11 మంది తప్పుడు సమాచారం అందించి విద్యాశాఖను బురిడీ కొట్టించినట్లు సమాచారం. భర్త ఒక మండలానికి, భార్య మరో మండలానికి బదిలీ అయ్యారు. వాస్తవంగా భార్యాభర్తలు ఒకే చోట పనిచేయాలని ప్రభుత్వం స్పౌస్ విధానాన్ని అమలు చేస్తోంది. పలువురు జీహెచ్‌ఎంలు తమకు అనుకూలంగా ఉన్న పాఠశాలలను ఎంచుకోవడానికి యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించినట్లు ఆరోపణలున్నాయి.

అంతులేని అవకతవకలు

- మహిళా సమాఖ్యల్లో అటకెక్కిన అధికారుల పర్యవేక్షణ
- అమలు కాని సంఘాల నియమావళి



న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం

అధికారుల నిర్లక్ష్యంతోనే పురపాలికల్లోని మెప్మా పరిధి మహిళా సంఘాల సమాఖ్యలు, మహిళా సంఘాల్లో భారీఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి. సంఘాలను సీవోలు, డీఎంసీలు పర్యవేక్షించాలి. వారు ఎలా పనిచేస్తున్నారో మెప్మా పీడీలు, పుర కమిషనర్లు ప్రతి మూడు మాసాలకు ఒకసారి సమీక్షించాలి. ఈ రెండంచెల విధానం పదేళ్లుగా మరుగున పడటంతో సంఘాలు, సమాఖ్యల్లో ఆర్థిక నేరాలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల పరిధిలో 457 మహిళా సంఘాల సమాఖ్యలు ఉండగా వాటి పరిధిలో 11,367 సంఘాలు ఉన్నాయి. సభ్యులుగా ఉన్న 4,13,670 మంది మహిళలు ప్రతి నెలా రూ. 4,13,67,000 వరకు పొదుపు చేస్తున్నారు. ఈ పొదుపును బట్టే బ్యాంకులు, స్త్రీనిధి బ్యాంకులు మహిళలకు వ్యక్తిగత, సామూహిక రుణాలు ఇస్తున్నాయి. ఆర్పీలు, సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి(ఓబీలు) మహిళలను తప్పుదోవ పట్టిస్తూ రుణంగా వస్తున్న రూ. లక్షల డబ్బు కాజేస్తున్నారు. బ్యాంకు నోటీసులందుకుని అమాయక మహిళలు రోడ్డున పడుతున్నారు.


కోయనగర్ సమాఖ్య లావాదేవీల్లో అవకతవకలు తనిఖీ చేస్తున్న సీవోలు, ఆర్పీల బృందం

పాతుకుపోయిన ఆర్పీలు, సీవోలు : ఆర్పీలను రెండు, మూడేళ్లకోసారి మార్చాలన్నది మెప్మా నియమావళిలోనే ఉన్నా పాతికేళ్లుగా అమలు కావటం లేదు. అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి(ఓబీల)ను మాత్రమే మారుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 457 ఆర్పీలు, 914 ఓబీలు పని చేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో ఆర్పీలు ఏళ్లుగా పాతుకుపోవడం వల్ల భారీగా అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. 94 సమాఖ్యలకు 94 మంది ఆర్పీలు ఉండగా సగానికి పైగా మంది ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే. అక్రమాలకు పాల్పడిన ఓ ఆర్పీ మూడేళ్ల క్రితం అదృశ్యమయ్యారు. ఇటీవల మరో ముగ్గురి నుంచి డబ్బుల రికవరీకి ఆదేశించటంతో వారు విధుల నుంచి తప్పుకొని ముఖం చాటేశారు. తాజాగా కోయనగర్ ఆర్పీ కూడా రూ.1.49 కోట్ల వరకు అవకతవకలు చేసినటుల తేలగా మహిళలు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీవోను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో గుమ్మడికాయల దొంగలు అంటే భుజాలు తడుముకున్నట్లు అవకతవకలు చేసిన ఆర్పీలు తమపై ఎక్కడ చర్యలు తీసుకుంటారోనని ఎమ్మెల్యేను, పురపాలిక ఛైర్మన్‌ను తరచూ కలుస్తూ సంజాయిషీలు ఇస్తున్నారు. మిగతా సమాఖ్యల్లోనూ అధికారులు పకడ్బందీగా విచారణ జరిపిస్తే భారీ మొత్తంలో అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంటుందని మహిళలు చెబుతున్నారు. ఆర్పీల లాగే సీవోలను కూడా ప్రతి మూడేళ్లకు ఒకసారి వార్డులు మార్చాల్సి ఉన్నా చేయటం లేదు. ఏళ్ల తరబడిగా పాతుకుపోవటంతో ఆర్పీలు, ఓబీలతో సంబంధాలు బలపడి ఆర్థిక అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇకనైనా ఆర్పీలను తొలగించి మహిళా సంఘాల తీర్మానంతో కొత్త వారిని నియమించాలని, సీవోలను బదిలీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

మొక్కుబడిగా ఏజెన్సీల ఆడిట్ : సమాఖ్యల ఆడిట్‌ను ఏటా స్థానికంగా ప్రైవేటు ఏజెన్సీలతో చేయిస్తున్నారు. ఆర్పీలు బ్యాంకర్లకు సమర్పించే సూక్ష్మ రుణ ప్రణాళిక దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సమాఖ్యల్లోని ఒక్కో సంఘానికి ఏడాదిలో ఎంత రుణం మంజూరైంది.. రుణాలు తీసుకుంటున్న మహిళలు సంఘాల సభ్యులేనా.. సంతకాలు వారివేనా.. రుణం తిరిగి చెల్లిస్తున్నారా.. లేదా అనేది తేల్చాలి. అలా చేయటం లేదు. ఆర్పీలు, ఓబీలు ఇచ్చే దస్త్రాలనే పరిశీలించి ఒకటి, రెండు రోజుల్లో ఆడిట్ పూర్తిచేస్తున్నారు. ఇప్పటివరకు ఒక్క అక్రమాన్నీ గుర్తించిన దాఖలాలు లేవు. మెప్మా ఉన్నతాధికారులు కూడా ఏటా సమాఖ్యల ఆడిట్‌కు ప్రధాన కార్యాలయం నుంచే అగ్రశ్రేణి ఆడిటర్లను పంపించాల్సి ఉన్నా చేయటం లేదు.

పత్తి అమ్మకానికి దారేదీ?

ఆన్‌లైనులో నమోదు కాక కౌలురైతులకు పాట్లు




పాలమూరులో ఓ జిన్నింగ్ మిల్లు వద్దకు పత్తితో వచ్చిన వాహనాలు

మహబూబ్‌నగర్, ఈనాడు : ఉమ్మడి జిల్లాలో 2,87,625 మంది చిన్న, సన్నకారు రైతులు, 26,760 మంది కౌలు రైతులు ఉన్నారు. ఇందులో 70 శాతం వరకు రైతులు తమ సొంత భూమితో పాటు మరికొంత కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 6.08 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా సుమారు 30 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం పత్తి చేతికి వస్తోంది. బయటి మార్కెట్‌లో పత్తి పంటకు సరైన ధర రావటం లేదు. ఈసారి క్వింటా పత్తికి సీసీఐ రూ. 7,521 మద్దతు ధర ప్రకటించింది. సీసీఐ కేంద్రాల్లో విక్రయించి ఆ ధర పొందుదామంటే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులకు ఏం చేయాలో పాలుపోవటం లేదు.

సాంకేతిక సమస్యలు : వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో ఏ పంటలు, ఎవరు సాగు చేశారో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కౌలు రైతు పత్తి సాగుచేసిన చోట కూడా పట్టాదారు పేరునే నమోదు చేశారు. దళారుల కట్టడికి వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట సాగు చేసినట్లు ఎవరి పేరు నమోదు చేసి ఉంటే వారి ఆధార్ కార్డు, బ్యాంకు, పాసు పుస్తకం తీసుకెళ్తేనే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోంది. కౌలు రైతులు సీసీఐకి వెళ్లి పత్తి పంట అమ్ముకోవాలంటే పట్టాదారు ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకంతో కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ఇందుకు పట్టాదారులు అంగీకరించటం లేదు. ఈ పరిస్థితిలో కౌలు రైతులు తమ పంట మద్దతు ధరకు ఎలా అమ్ముకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు.

గత్యంతరం లేక ప్రైవేటుకు : ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోలుకు సీసీఐ 28 జిన్నింగ్ మిల్లులను గుర్తించింది. ప్రస్తుతం అన్ని జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని సీసీఐ అధికారులు చెబుతున్నారు. రైతులు తీసుకొచ్చే పత్తిని మాత్రం తేమ శాతం 8 నుంచి 12 మధ్యలో లేదని, ఇతర కారణాలు చెప్పి కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. గత్యంతరం లేక జిన్నింగ్ మిల్లు వాళ్లకే తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోంది. కొన్ని చోట్ల జిన్నింగ్ మిల్లులకు సీసీఐ అధికారులే పరోక్షంగా సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

గ్రామాల్లోకి దళారులు.. : సీసీఐ కేంద్రాల్లో చాలా మంది కౌలు రైతుల పత్తి కొనుగోలు చేయకపోవటంతో దళారుల దృష్టి వారిపై పడింది. ఇప్పటికే గ్రామాల్లో అడ్డావేసి తాము పంటను కొనుగోలు చేసి వెంటనే డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. పంట తడిసిందని, తేమ శాతం ఎక్కువగా ఉందని క్వింటాకు రూ. 4,500 నుంచి రూ. 6వేలే ధర చెల్లిస్తున్నారు. దీనిపై సీసీఐ మహబూబ్‌నగర్ డీజీఎం మహేశ్వర్‌రెడ్డిని 'ఈనాడు' సంప్రదించగా వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పత్తి సాగు చేసినట్లు నమోదైన వారు ఆధార్, బ్యాంకు పాసు పుస్తకంతో పంట తీసుకొస్తే కొనుగోలు చేస్తామని చెప్పారు. వారు కౌలు రైతా, పట్టా రైతా అనేది తాము చూడమని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ మాట్లాడుతూ.. సాగులో కౌలు రైతు ఉన్నా పట్టాదారు పేరునే నమోదు చేస్తామని వెల్లడించారు. పట్టాదారుడితో కౌలుదారులు సమన్వయం చేసుకుని వారి పంట విక్రయించుకోవాలని పేర్కొన్నారు.

సంగ్రహణాత్మక పరీక్షలకు ఏర్పాట్లు

జిల్లాలో రాయనున్న 1.13 లక్షల మంది విద్యార్థులు


మాన్‌దొడ్డి పాఠశాలలో పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ - సంగ్రహణాత్మక మూల్యాంకనం) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభవగా, ఇప్పటి వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)-1, 2 పరీక్షలు పూర్తయ్యాయి. ప్రస్తుతం విద్యార్థుల్లోని గుణాత్మక విద్యను అంచనా వేసేందుకు విద్యాశాఖ ఎస్ఏ పరీక్షలు నిర్వహించనుంది. ఇందుకోసం ఇప్పటికే అన్ని పాఠశాలలకు పరీక్షా పత్రాలను పంపించడంతో పాటు, పరీక్షలు నిర్వహణకు సంబంధించిన సమయ పట్టికను అందించారు. ఉపాధ్యాయులు ఇందుకు తగ్గట్లుగా విద్యార్థులను సన్నద్ధం చేశారు.

జిల్లాలో ఇలా: జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, గురుకుల పాఠశాలలు మొత్తం 620 ఉన్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 1.13 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 460 ప్రభుత్వ, 12 కేజీబీవీ, 15 గురుకులాలు, 133 ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. సోమవారం నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. తరువాత ఉపాధ్యాయులు పరీక్షా పేపర్లు దిద్ది, ఫలితాలను విద్యార్థులకు వెల్లడించడంతో పాటు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి, విద్యార్థుల ఫలితాలపై చర్చించాలి. పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా విద్యాధికారి రవీందర్ తెలిపారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయండి

జిల్లా వ్యాప్తంగా భారాస నిరసనలు


గద్వాల అంబేడ్కర్‌చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న భారాస నాయకులు

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: వానాకాలపు రైతు భరోసాను వెంటనే విడుదల చేయడంతో పాటు ప్రతి రైతుకు సంపూర్ణ రైతు రుణమాఫీ చేయాలని భారాస రాష్ట్ర నాయకులు కురువ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. రైతులకు వర్షాకాల రైతు భరోసాను ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకి నిరసనగా భారాస కార్య నిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేశారు. గద్వాలలోని అంబేడ్కర్ చౌక్ వద్ద జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా పేరుతో ఇస్తామని, ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ రైతులను నట్టేట ముంచే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. గద్వాల అభివృద్ధి కోసం తాను పార్టీ మారినట్లు ఎమ్మెల్యే చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఆయన ఎందుకు పార్టీ మారారో అందరికీ తెలుసన్నారు. భారాస నాయకులు బీచుపల్లి, మత్తాలి, ప్రతాప్ రెడ్డి, రవి, నరసింహ, తిరుమలేశ్, వెంకటన్న, లక్ష్మన్న, మల్లకల్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయం వద్ద సందడి


ఆరు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతుండటంతో ఆ దృశ్యాన్ని తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు జలాశయం దృశ్యకేంద్రం వద్ద ఆగుతున్నారు. నీటి పరవళ్లను తిలకించి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి స్వీయచిత్రాలు తీసుకుంటున్నారు. ఆదివారం సెలవు కావటంతో పర్యాటకులు అధికసంఖ్యలో తరలి వచ్చారు.

సంపద వనం.. మొక్కలు కనం!



కుమ్మెర వద్ద పాలమూరు - రంగారెడ్డి పంపుహౌస్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సంపద వనం బోర్డు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జలాశయాల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున సంపద వనాల పేరుతో మొక్కలను నాటినా.. నిర్వహణ లేక లక్ష్యం నీరుగారుతోంది. ఏడాది క్రితం పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల వద్ద ఏర్పాటు చేసిన దశాబ్ది సంపద వనాలు గడ్డిలో కలిసిపోయాయి. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర శివారులో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపుహౌజ్, జలాశయం వద్ద సంపద వనాన్ని ఏర్పాటు చేశారు. ఎకరానికి 800 మొక్కల చొప్పున నాటారు. కుమ్మెర పంపుహౌజ్ వద్ద 38 ఎకరాల్లో మొక్కలు నాటారు. మొక్కలు నాటిన తర్వాత మళ్లీ పట్టించుకోలేదు. ఫలితంగా కొన్ని ఎండిపోగా మరికొన్ని పూర్తిగా గడ్డిలో కలిసి పోయాయి. ఒక్క మొక్క కనిపించక పోవడంతో సంపద వనం బోర్డుకే పరిమితమైంది. ఉపాధి హామీ పథకం కూలీలతోనైనా మొక్కలకు నీటిని పట్టించడం, సంరక్షణ చర్యలు చేపట్టలేదు. జలాశయాల్లో పనిచేసే ప్రాజెక్టు అధికారులు, గుత్తేదారులు వాటిపైపు చూడలేదు. దీంతో అవన్నీ మొక్కుబడిగా మారాయి.


మండలం	జలాశయం	నాటిన మొక్కలు ఎకరాల్లో..
బిజినేపల్లి	వెంకటాద్రి	27
బిజినేపల్లి	కుమ్మెర పంపుహౌజ్	38
కొల్లాపూర్	ఎల్లూరు	3
జొన్నలబొగుడ కేఎల్ఐ రెండో లిఫ్టు		25
ఏదుల (పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు)		42

సంరక్షణకు చర్యలు.. : జలాశయాల వద్ద స్థల లభ్యత దృష్ట్యా అక్కడ అధికంగా మొక్కలు నాటే ప్రక్రియను గతేడాది చేపట్టాం. కొన్ని ప్రాజెక్టుల పరిధిలోకి కూలీలు, ఇతరులు వెళ్లేందుకు కొన్నిసార్లు అనుమతి ఉండదు. బ్లాస్టింగ్ పనుల దృష్ట్యా ముందస్తు అనుమతి తప్పనిసరి. అయినా మొక్కలను సంరక్షించాలని ప్రాజెక్టు సిబ్బందికి సూచించాం. జలాశయాల ప్రాంతాల్లో ఉండే గ్రామీణాభివృద్ధి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపడతాం.

- చిన్న ఓబులేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, నాగర్‌కర్నూల్

రెండు నదుల్లోనూ పెరుగుతున్న వరద

అటు కర్ణాటక ప్రాజెక్టులకు ఇటు జూరాలకు వరద కొనసాగుతోంది


జూరాల గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ధరూరు, శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: ఇటు కృష్ణా, అటు తుంగభద్ర నదుల్లో వరద పెరుగుతోంది. జూరాల జలాశయంలోకి ఆదివారం సాయంత్రం 1.20 లక్షల క్యూసెక్కుల వరద చేరుతోంది. 23 గేట్లు ఎత్తి 94 వేల క్యూసెక్కులు, జలవిద్యుదుత్పత్తి ద్వారా 33 వేల క్యూసెక్కులు మొత్తం 1.27 లక్షల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 60వేల క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 59 వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 88 వేలు చేరుతుండగా దిగువకు 86 వేల క్యూసెక్కుల వదులుతున్నారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా అటు కర్ణాటక ప్రాజెక్టులకు ఇటు జూరాలకు వరద కొనసాగుతోంది

తుంగభద్ర: నదిలో 66,252 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 11.7 అడుగుల ఎత్తులో నీటిపారుదల ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.1 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చే సరికి అది 5 అడుగులుగా ఉంది. ● సుంకేసుల జలాశయానికి 95,500 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో 22 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 93,300 క్యూసెక్కులను శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. కేసీ కాలువకు 2 వేల క్యూసెక్కులు వదులుతున్నామని డ్యాం అధికారులు తెలిపారు.

సార్వత్రిక విద్యతో బంగారు భవిష్యత్తు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: మధ్యలో మానేసిన, రెగ్యులర్‌గా చదువుకునేందుకు సమయం దొరకని వారి భవిష్యత్తుకు సార్వత్రిక విద్య తోడ్పాటునిస్తోందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ శివయ్య పేర్కొన్నారు. గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ విద్యా కేంద్రంలో ప్రవేశాల నిర్వహణపై ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది, ఇంటర్ ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయాలని కో ఆర్డినేటర్లకు సూచించారు. జిల్లా కో ఆర్డినేటర్ సునీతమ్మ, పాఠశాల జీహెచ్‌ఎం ఇమ్మానియేల్, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న శివయ్య తదితరులు

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..



ధరూరు, న్యూస్‌టుడే: విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు ఉంటాయి. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లే వారిలో చాలా మంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణా శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అవగాహన లేక దళారులను ఆశ్రయించి అధిక మొత్తం సొమ్ము ఖర్చు చేసుకుంటున్నారు. అసలు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఎలా పొందాలంటే..


మీ కోసం

విద్య కోసం: ఉన్నత విద్య అభ్యసించటానికి అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యాతో పాటు పలు దేశాలకు వెళ్తుంటారు. ఆయా దేశాలకు వెళ్లిన వారు గ్రీన్ కార్డు హోల్డర్లుగా మారి అక్కడే స్థిర పడుతుండగా మరి కొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పనిసరి అయ్యింది. ఈక్రమంలో చాలా మంది ఐడీఎల్‌ను తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

లెర్నింగ్ మాదిరిగా..: రాష్ట్ర రవాణా శాఖ జారీ చేసే అంతర్జాతీయ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. ఆయా దేశాల వాహనాలు నడపటానికి అనుమతి ఇస్తారు. ఒక రకంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాల్లో ఏడాది కాలం లెర్నింగ్ లైసెన్స్‌గా చెల్లుబాటవుతుంది. నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి డ్రైవింగ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

పొందడం ఇలా

- అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడి డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పాస్‌పోర్టు (కనీసం 6 నెలల గడువుతో) మనం ఏ దేశానికి వెళ్తున్నామో దానికి సంబంధించిన వీసా జతచేయాలి. వీసా తర్వాత వస్తుందని అనుకుంటే అందుకు సంబంధించిన ఇతర ఆధారాలు అందజేయాలి.
- ఆరోగ్య పరంగా వైద్య ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఫాం-ఏ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్ని సక్రమంగా ఉంటే ఐడీఎల్ జారీ చేస్తారు.
- ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్ల వ్యవధిలో ఇప్పటి వరకు 1,250 వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకున్నారు.



అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ నమూనా

అమెరికాలో నిబంధనలు కఠినం: అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలుంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవటానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లైసెన్స్ జారీ చేస్తారు. అనంతరం డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాలి. డ్రైవింగ్ పరీక్ష నిర్వహించే సమయంలో ఎంవీఐ పక్కన కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ల ద్వారా మన ఛోదనను పరిశీలించి ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేసే సమయంలో ఏవైనా పొరపాట్లు చేస్తే వాటికి రుజువు చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.

మనింట్లోనూ స్మార్ట్ జాంబీలు

- బాని'సెల్' అవుతున్న చిన్నారులు
- వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు

"అన్నం తినడానికి, అల్లరి చేయకుండా కుదురుగా కూర్చోవడానికి గద్వాల పట్టణానికి చెందిన ఓ తల్లి కుమారుడికి చరవాణి ఇచ్చేది. ఒకటో తరగతికి వచ్చిన ఆ పిల్లాడు ప్రస్తుతం ఫోన్ ఇవ్వకపోతే అందరినీ కొడుతున్నాడు. గట్టిగా ఏడుస్తున్నాడు. చేసేది లేక మానసిక వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించారు."


"ఉమ్మడి జిల్లాలో ఓ మండలానికి చెందిన ఏడో తరగతి బాలుడు ఇంట్లో అందరూ నిద్రించాక రాత్రి ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడు, తండ్రి ఫోన్ తీసుకొని గంటల తరబడి వాడటంతో ఆలస్యంగా నిద్రలేచేవాడు. దీనివల్ల కంటి సమస్య, చికాకు, నీరసం వంటి సమస్యలు వచ్చి చదువులో వెనుకబడ్డాడు."



రాజోలి, న్యూస్‌టుడే: పాలు తాగే పిల్లలు ఆకలితో ఏడిస్తే కన్నతల్లి దగ్గరకు తీసుకొని కడుపు నింపేది. భయంతో ఏడిస్తే నేనున్నాని భరోసా నింపుతూ ఎత్తుకొని లాలించేవారు. చందమామను చూపిస్తూ.. గోరు ముద్దలు తినిపించే వారు.. కథలు చెబుతూ.. పాటలు పాడుతూ నిద్ర పుచ్చేవారు. స్మార్ట్‌ఫోన్ పుణ్యమాని ఇవన్నీ మాయమైపోయాయి. ఆప్యాయతలు, ప్రేమానురాగాలు నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి. పిల్లాడు మారాం చేస్తే చాలు సెల్‌ఫోన్ చేతిలో పెడితే ఏడుపు ఆగిపోతోంది. పిల్లలు గంటల తరబడి స్క్రీన్ టైం గడుపుతూ వాటికి బానిసలై 'స్మార్ట్ జాంబీలు'గా మారిపోతున్నారు. ఆటలు ఆడుతూ గడపాల్సిన బాల్యం, చరవాణిలో బందీ అవుతోంది.

ఇవీ అనర్థాలు : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తల్లిదండ్రులు మానసిక వైద్యుల వద్దకు తీసుకొస్తున్న పిల్లల్లో సింహభాగం సెల్‌ఫోన్ బాధితులే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పిల్లలు రోజూ 3 - 4 గంటలు చరవాణి చూడటం వల్ల మానసిక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, 5 ఏళ్ల లోపు చిన్నారులు రోజుకు ఒక గంట కంటే ఎక్కువ ఫోన్ చూడకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. స్మార్ట్ స్క్రీన్ నుంచి విడుదలయ్యే బ్లూ లైట్ వారి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని, రేడియేషన్ ప్రభావంతో నెగిటివ్ ప్రభావం చూపుతోందని వైద్యులు చెబుతున్నారు.

10 నుంచి 15 ఏళ్లలోపు 100 మంది పిల్లల సర్వేలో తేలిన అంశాలివి



సర్వేలు, పరిశోధనలు చెబుతున్న నిజాలివి





- ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లల్లో 99 శాతం మంది మొబైల్‌ఫోన్లు, గాడ్జెట్‌లకు అలవాటు పడుతున్నారు.
- దేశంలో 66 శాతం మంది తల్లిదండ్రులకు తమ పిల్లలు అధిక స్క్రీన్ సమయం వెచ్చిస్తుండటం ప్రమాదకరమని తెలియదు.
- ఓ అధ్యయనం ప్రకారం 65 శాతం కుటుంబాలు తమ పిల్లలు అన్నం తినడానికి ఫోన్లు, టీవీలు చూపిస్తున్నారు.
- 12 నెలల వయసున్న పిల్లలు రోజుకు 53 నిమిషాలు స్మార్ట్‌ఫోన్ చూస్తున్నారు. 3 సంవత్సరాల పిల్లలు గంటన్నరకు పైగా చూస్తున్నారు.
- చరవాణి అతిగా వాడే పిల్లల్లో మెదడు, వినికిడి, మాట్లాడే సామర్థ్యంపై ప్రభావం పడుతుందని వెల్లడైంది. ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యాన్ని వారు కోల్పోతున్నారు.

తల్లిదండ్రులు ఏం చేయాలంటే...



- పిల్లలకు వీలైనంత వరకు డిజిటల్ తెరలకు దూరంగా ఉంచడమే శ్రేయస్కరం. శారీరక శ్రమ కలిగించేలా ఆటలు ఆడించడం, నైపుణ్యాలను పెంచే విధంగా తల్లిదండ్రులు వారికి సూచనలు చేయాలి. నెమ్మదిగా ప్రయత్నిస్తే ఇది సాధ్యమే.
- పిల్లలున్న సమయంలో తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్ వాడకపోవడం మంచిది. లేదంటే పెద్దలు చూసే సామాజిక మాధ్యమాలు, వీడియోలు, రీల్స్‌కు త్వరగా అలవాటు పడతారు. ముఖ్యంగా గేమ్స్ ఆడకుండా చూడాలి.
- బడి నుంచి ఇంటికి రాగానే దగ్గరుండి వారితో హోమ్‌వర్క్ చేయించాలి. స్మార్ట్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాల గురించి తరచూ పిల్లలకు వివరించాలి.

కుంగుబాటుకు కారణం



స్మార్ట్‌ఫోన్‌తో ఎక్కువ సమయం గడిపే వారు ఎవ్వరితో మాట్లాడరు. ఆడుకోరు. తల్లిదండ్రులతో అరవడం, వాగ్వాదం చేస్తుంటారు. మానసికంగా కుంగిపోతారు. సెల్‌లో గేమ్స్ ఎక్కువగా ఆడటం వల్ల డిప్రెషన్‌లోకి వెళ్తారు. ఈ మధ్య ఇలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయి. తల్లిదండ్రులు ఆటలు ఆడించడం, వారితో కలసి ఆడటం, తోటి పిల్లలతో కలిసేలా చేయడం తదితరాలు చేయాలి.

-డా.హేమలత, మానసిక వైద్య నిపుణురాలు, గద్వాల

23న పీయూలో క్రీడాకారుల ఎంపికలు

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో ఈనెల 23 నుంచి రెండు రోజుల పాటు వివిధ పోటీల్లో క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని పీడీ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌత్‌జోన్, అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు సంబంధించి బాస్కెట్‌బాల్ పురుషుల విభాగంలో 23న, మహిళల క్రికెట్ 25న, అదే రోజు క్రాస్ కంట్రీ స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారుల వయస్సు 17 నుంచి 25 వరకు ఉండాలన్నారు. ప్రస్తుతం వివిధ కళాశాలల్లో చదువుతున్న అభ్యర్థులు, తమ ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడు, కర్ణాటక, తదితర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

జాతీయ సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో జిల్లా వాసికి రజతం



కె.కార్తీక్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: బెంగళూరులో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 5వ సౌత్‌జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా వాసికి రజతం దక్కింది. మహబూబ్‌నగర్‌కు చెందిన కె.కార్తీక్ హెప్టఅత్లాన్ విభాగంలో ప్రతిభ చాటి రజతం కైవసం చేసుకున్నాడు. రాష్ట్రానికి రజతం సాధించిన అథ్లెట్‌ను అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి జి.శరత్‌చంద్ర, ఉపాధ్యక్షుడు రాజేంద్ర కుమార్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి పుట్టి సురేశ్ చందర్, సభ్యులు ఆనంద్, సాదిఖ్, సునీల్ తదితరులు అభినందించారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే లక్ష్యం




పరుగు ప్రారంభోత్సవంలో క్రీడాజ్యోతితో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఆదివారం సీఎం కప్ క్రీడా జ్యోతి జిల్లాకు చేరుకోగా స్వాగతం పలికి, క్రీడా జ్యోతి పరుగును కలెక్టర్ ఎస్పీ డి.జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్‌తో కలసి ప్రారంభించారు. ఈ పరుగు డీఎస్ఏ మైదానం నుంచి మెట్టుగడ్డ డైట్ కళాశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సీఎం కప్ క్రీడా టోర్నీని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి మండల, జిల్లా రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సాట్స్ ప్రతినిధులు రతన్‌బోస్, గోకుల్ యాదవ్, సాయిబాబా, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్, డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్, కౌన్సిలర్ రాంలక్ష్మణ్, క్రీడా సంఘాల ప్రతినిధులు, శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు ర్యాలీలో పాల్గొన్నారు.

ప్రజల రక్షణకు ప్రాణత్యాగాలు

ఉమ్మడి జిల్లాలో అమరులైన 39 మంది పోలీసులు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ నేరవిభాగం



శాంతి భద్రతలు, ప్రజల రక్షణకు.. రాత్రింబవళ్లు పని చేసేది పోలీసులే. ప్రజలంతా హాయిగా నిద్రపోతుంటే వారు గస్తీ కాస్తుంటారు. అందరూ పండగ చేసుకుంటే వారు బందోబస్తులో తలమునకలుగా ఉంటారు. అలాంటి పోలీసులు విధి నిర్వహణలో ప్రాణత్యాగాలు కూడా చేశారు. ఉమ్మడి జిల్లాలో 39 మంది పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారు. అలాంటి పోలీసుల సేవలు, త్యాగాలను గుర్తు చేసుకుని వారికి నివాళి అర్పించేందుకు ఏటా అక్టోబర్ 21న **'పోలీసు అమరవీరుల సంస్మరణ దినం'** నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1990-2000 మధ్య కాలంలో మావోయిస్టుల ప్రాబల్యం తీవ్రంగా ఉండేది. అచ్చంపేట, అమ్రాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, బిజినేపల్లి, గద్వాల, వనపర్తి, వీపనగండ్ల, పెద్ద కొత్తపల్లి, పాన్‌గల్, కొత్తకోట, మక్తల్, కృష్ణ, వెల్దండ, వంగూరు, బల్మూరు తదితర ప్రాంతాల్లో మావోయిస్టు దళాలు ఉండేవి. ప్రధానంగా నల్లమల అటవీ ప్రాంతంలో వారి ప్రభావం చాలా ఎక్కువగా ఉండేది. మావోలు గుర్తించకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సాధారణ దుస్తుల్లోనే విధులు నిర్వహించేవారు. ప్రత్యేక వాహనాల్లో ప్రయాణించేవారు కాదు. ట్రాక్టర్లు, లారీలు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో రాకపోకలు సాగించేవారు. మందుపాతరలు, ఎదురుకాల్పులు సర్వసాధారణం. ఎప్పుడు ఎక్కడ ఏ ఘటన జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇలాంటి క్లిష్ట సమయంలో పోలీసులు ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించారు.

బస్సును పేల్చిన ఘటనలో..

ఉమ్మడి జిల్లాలో మావోయిస్టులు జరిపిన దాడుల్లో అతి పెద్ద ఘటన సోమశిలదే. కొల్లాపూర్ సమీపంలోని సోమశిల వద్ద కొందరు మావోయిస్టులు 1993 నవంబర్ 13న ఆర్టీసీ బస్సును దగ్ధం చేయటంతో పాటు అక్కడే ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని మందు పాతరతో పేల్చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించడానికి 14వ తేదీన అప్పటి ఉమ్మడి జిల్లా ఎస్పీ పరదేశీ నాయుడు, వనపర్తి డీఎస్పీ, ఇద్దరు ఎస్సైలు, 30 మంది వరకు పోలీస్ సిబ్బంది ఒక ప్రైవేటు బస్సులో వెళ్లారు. బస్సు టాప్‌పై ఉన్న ఆయుధాలను గమనించిన మావోయిస్టులు అందులో ఉన్నది పోలీసులేనని నిర్ధారించుకున్నారు. సోమశిలకు వెళ్లి వివరాలను తెలుసుకున్న ఎస్పీ, పోలీసులు తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో మందుపాతరతో బస్సును పేల్చేశారు. వెంటనే కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఎస్పీ పరదేశీ నాయుడుతో పాటు ఇద్దరు ఎస్సైలు, ఆరుగురు పోలీసులు మృతిచెందారు. ఈ ఘటన అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో సంచలనంగా మారింది. 1997 మే 17న అమ్రాబాద్ నుంచి ఎస్సై మన్సూర్ తన సిబ్బందితో కలిసి జీపులో వెళ్తుండగా అదే మండలంలోని లక్ష్మాపూర్ వద్ద మావోయిస్టులు మందు పాతరతో వాహనాన్ని పేల్చేశారు. ఈ ఘటనలో ఎస్సైతో పాటు మరో నలుగురు పోలీసులు చనిపోయారు. 2015లో సూర్యాపేట ఆర్టీసీ బస్టాండులోని ఓ బస్సులో తనిఖీలు నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో జడ్చర్లకు చెందిన ఎస్సై సిద్దయ్య అసువులు బాశారు. ఇలా అనేక ఘటనల్లో పోలీసులు ప్రాణత్యాగం చేశారు. వారిని స్మరిస్తూ ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్‌తో పాటు వివిధ కార్యక్రమాలు, విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీ నేపథ్యంలో ముందస్తుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా టోర్నీ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఎండీసీఏ మైదానంలో 21 నుంచి 28 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ టోర్నీలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, కొడంగల్ జట్లు పాల్గొంటున్నాయి. పూల్-ఏలో మూడు, పూల్-బిలో మూడు జట్లను విభజించి ఒక్కో జట్టు మూడు మ్యాచ్‌ల చొప్పున ఆడాల్సి ఉంటుంది. ఈ వన్డే టోర్నీలో పూల్-ఏ విన్నర్‌తో పూల్-బి విన్నర్ జట్టు ఫైనల్‌లో తలపడతుంది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే 16 మంది క్రీడాకారులతో ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేయనున్నారు. ఎంపికయ్యే ఉమ్మడి జిల్లా జట్టు నవంబర్ 4వ తేదీ నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో నిర్వహించే అండర్-23 రాష్ట్రస్థాయి హెచ్‌సీఏ టోర్నీలో పాల్గొంటుంది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాలమూరుకు ద్వితీయ స్థానం

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో నిజామాబాద్ జట్టు మొదటి, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ, మెదక్ జట్టు తృతీయ పతకాలు సాధించినట్లు వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు. రామగుండం స్పెషల్ బ్రాంచ్ సీఐ కంప రవీందర్, ఎనుమాముల సీఐ రాఘవేందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరంగల్ రెడ్డిపాలెంలోని ఇన్ఫాంట్ జీసస్ కాన్వెంట్ పాఠశాలలో ఆదివారం జరిగిన ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు కోసం నిరంతరం శ్రమించాలని క్రీడాకారులకు సూచించారు. సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, బీమగాని ముఖర్జీ, పాఠశాల ప్రిన్సిపల్ మరియమ్మ మ్యాథ్యూ తదితరులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

వంగూరు, న్యూస్‌టుడే : డిండి ఎత్తిపోతల (డీఎల్ఐ) కాలువ పనుల్లో భాగంగా మండలంలోని నర్సంపల్లి గ్రామ సమీపంలో బ్లాస్టింగ్ చేస్తున్నారు. ఆదివారం బ్లాస్టింగ్ సందర్భంలో అదే గ్రామానికి చెందిన ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. నర్సంపల్లి గ్రామానికి చెందిన దేరంగుల శ్రీను, కృష్ణవేణి దంపతుల కుమారుడు రిషితేజ వంగూరులో 10వ తరగతి చదువుతున్నారు. గ్రామ సమీపంలో ఉన్న డీఎల్ఐ కాలువ పనుల వద్ద గుత్తేదారుడు బ్లాస్టింగ్ చేయడంతో రాళ్లు చాలా దూరం వేగంగా వచ్చి పడుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న రిషితేజకు ఓ రాయి వేగంగా వచ్చి తగిలింది. చేతికి తీవ్ర గాయాలతో కింద పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెల్దండ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ శైవక్షేత్రం దక్షిణకాశీ బాలబ్రహ్మేశ్వర స్వామి, అయిదో శక్తిపీఠమైన జోగులాంబ ఆలయాల్లో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర రాష్ట్రాల భక్తులు సైతం తరలి వచ్చారు. స్వామికి అభిషేకం, స్పర్శదర్శనం, జోగులాంబ అమ్మ వారికి త్రిశతి, ఖడ్గమాల, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మ వారికి భక్తులు చీరలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం అనంతరం ఆలయాల సమీపంలోని తుంగభద్ర నదిలో పడవలో చెక్కర్లు కొడుతూ ఆహ్లాదంగా గడిపారు. పుష్కర్ ఘాట్ నుంచి నది పరవళ్లను తిలకించారు.



జోగులాంబ ఆలయంలో భక్తులు

27న అన్నమాచార్య సంకీర్తనాలాపన

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం తిరుమలదేవుడి గుట్టలో వెలసిన శ్రీతిరుమలనాథస్వామి ఆలయంలో ఈనెల 27న శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 54 సంకీర్తనల గానాలాపన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టనున్నట్లు గాయకుడు, అన్నమయ్యవాణి లలిత సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు గద్వాల చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. లోకకల్యాణార్థం 27వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గానకచేరి ఉంటుందని తెలిపారు.

సిగరెట్ల ఏజెన్సీలో భారీ చోరీ

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్లలో దొంగలు తెగబడ్డారు. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సిగరెట్ల ఏజెన్సీ తాళాలు ధ్వంసం చేసి భారీ మొత్తంలో సిగరెట్లను గూడ్స్ వాహనంలో తీసుకెళ్లారు. బాధిత వ్యాపారి, ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. జడ్చర్ల రైల్వే స్టేషన్ సమీప కాలనీలో విఘ్నేశ్వర ఏజెన్సీకి సంబంధించిన హోల్‌సేల్ దుకాణం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు గూడ్స్ వాహనం తీసుకొచ్చి దుకాణం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. వివిధ బ్రాండ్లకు చెందిన 32 కార్టన్ల సిగరెట్లను ఎత్తుకెళ్లారు. ఉదయం 6 గంటలకు ఏజెన్సీ ఎదుట కిరాణం నిర్వహించే వ్యాపారి.. తాళం ధ్వంసమై ఉండటాన్ని గుర్తించి యజమానికి సమాచారం ఇచ్చారు. దుకాణం సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా తెల్లవారుజామున 3 గంటల తర్వాత దొంగలు గూడ్స్ వాహనంలో వచ్చి సిగరెట్ల కార్టన్లు తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. రూ.32 లక్షల విలువైన సిగరెట్లు పోయాయని బాధితుడు మణికాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ఇదే ఏజెన్సీలో రెండేళ్ల క్రితం రూ.5లక్షల విలువైన సామగ్రి, నగదు అపహరించారు.



సీసీ కెమెరా ఫుటేజీలో గూడ్స్ వాహనంలో సిగరెట్ల కార్టన్లు పెడుతున్న దొంగలు

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక, సలార్, అయిజ: శివపాయి: దేవర, భువనేశ్వర్: విశ్వం, మాధవ్: వేట్టయన్
-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

విద్యుత్తు స్తంభాల ఏర్పాటు


పూడూరులో విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: పూడూరు గ్రామంలో ఎమ్మెల్యే ఆదేశానుసారం శిథిలావస్థకు చేరిన 10 విద్యుత్తు స్తంభాలను తొలగించి వాటి స్థానంలో ఆదివారం కొత్తవి ఏర్పాటుచేయించి నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలోని ఎస్సీకాలనీలో కొత్త నియంత్రికను ఏర్పాటుచేసి లోవోల్టేజీ సమస్యను తీర్చనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పూడూరు చిన్నయ్య, వీడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న అదనపు ఎస్పీ

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాలను ఆదివారం జిల్లా అదనపు ఎస్పీ గుణశేఖర్ దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం జోగులాంబ అమ్మ వారి మహా మంగళహారతిని స్వీకరించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రాలతో సత్కరించారు. వారితో పాటు బందువులున్నారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,467

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: నవాబ్‌పేటలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం మొక్కజొన్న గరిష్ఠంగా క్వింటా రూ.2,467, కనిష్ఠంగా రూ.2,330, జొన్న క్వింటా రూ.2,012 ధర వచ్చినట్లు పలికినట్లు కార్యదర్శి తెలిపారు. రైతులకు సకాలంలో ధాన్యం విక్రయాలు చేసినట్లు చెప్పారు.

ద్విచక్ర వాహనాలే లక్ష్యం?

జిల్లాలో పోలీసులకు సవాల్ విసురుతున్న చోరులు



ధరూరు మండల కేంద్రంలో పది రోజుల కిందట ఈ ద్విచక్రవాహనాన్ని ఎవరో అపహరించారు. రోజూ లాగే ఇంటి ముందు పెట్టిన ఈ వాహనం అర్ధరాత్రి వేళలో చోరీకి గురైంది. గద్వాలలో రెండు రోజుల కిందట రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. జిల్లాలో ఇలాంటి ఘటనలు సాధారణమైపోతున్నాయి.



గద్వాల, న్యూస్‌టుడే: ఇంటిముందు ద్విచక్రవాహనం ఆగి ఉందా.. ఒకటి లేదా రెండు రోజులు అదే ప్రదేశంలో ఉందా.. ఉంటే రెక్కీ నిర్వహించి రాత్రికి రాత్రే దాన్ని దుండగులు అపహరిస్తున్నారు. ద్విచక్రవాహన చోరుల దెబ్బకు జిల్లాలో ఆయా మండలాల పరిధిలో ఆరుబయట అరుగుల ముందు వాహనాలు నిలపాలంటేనే యజమానులు బెంబేలెత్తుతున్నారు. జిల్లాలో ప్రతి రోజూ ఆయా మండలాల వారీగా తరచి చూస్తే ద్విచక్రవాహనాల చోరీ జరుగుతూనే ఉంది. తాజాగా గద్వాల పరిధిలో శనివారం మూడు ద్విచక్రవాహనాలు చోరీకి గురికాగా ఆదివారం మరొకటి పట్టపగలే రోడ్డుపై ఆపి ఉంచి వ్యవసాయ పొలంలోకి వెళ్లి వచ్చే సరికి మాయమైపోయింది. ఇలా చెప్పుకుంటూపోతే ప్రతి మండలంలో వారంలో రెండు నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతున్నాయి. కొన్నింటిపై యజమానులు ఫిర్యాదులు చేస్తుండగా మరి కొన్నింటి ఆచూకీ కోసం వారే స్వయంగా వెతుక్కుంటున్నారు.

సరిహద్దులు దాటిస్తున్నారా: చోరీ చేసిన వాహనాలు ఇదే జిల్లాలో విక్రయిస్తే పట్టుబడుతామనే ఆలోచనతో చోరులు పైఎత్తులు వేస్తున్నారు. చోరీ చేసిన వాహనాలను కర్ణాటక, ఆంధ్రా సరిహద్దులు దాటిస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా చోరీలు ఒకే మండలం పరిధిలో చేయకుండా ఒక సారి ధరూరు మండలంలో చేస్తే, మరోసారి గద్వాల మండలం ఇలా పోలీసులకు సైతం అంతుచిక్కకుండా చోరీలకు పాల్పడుతున్నారు. గత వారం కిందట ధరూరు మండలంలో రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురికాగా ఒకటి ఆంధ్రా ప్రాంతం యమ్మిగనూరులో కనిపించటంతో అక్కడి వారు గుర్తించి యజమానులకు సమాచారం ఇచ్చారు. వాహన యజమాని అక్కడికి చేరుకునే లోపే అక్కడి నుంచి వాహనంతో సహా జారుకున్నారు. దీంతో చేసేది లేక యజమాని తిరిగి రావాల్సిన పరిస్థితి. రూ.2.50 లక్షల వరకు వాహనం విలువ ఉంటుందని యజమాని తెలిపారు. చోరీ చేసిన వాహనాలను సైతం గుర్తించకుండా ఉండటం కోసం వాటి నంబర్ ప్లేట్లపై ఉన్న అక్షరాలను చిన్నగా రాయించి సీసీ కెమెరాల్లో సైతం నమోదు కాకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో పోలీసులకు జోగులాంబ జిల్లాలో ద్విచక్రవాహనాల చోరీ సవాల్‌గా మారింది.

భారీ సంఖ్యలోనే: గత పది నెలల కాలంలో జిల్లాలో దాదాపు 550పైగా ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. అందులో కేసులు నమోదైన వాటి సంఖ్య 80 శాతం వరకు ఉంటుంది. రికవరి సంఖ్య 10 శాతం మాత్రమే ఉంది. మిగతా వాహనాల ఆచూకీ దొరకటం లేదు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం ఇవ్వాలి: గ్రామాల్లో, పురపాలికల్లోని వార్డుల పరిధిలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు సమాచారం పోలీసులకు ఇవ్వాలి. చోరీలను అరికట్టటానికి ఇప్పటికే రాత్రి వేళల్లో అన్ని గ్రామాల్లో మా సిబ్బంది గస్తీ తిరుగుతున్నారు. గతంలో చోరీలకు పాల్పడిన వారు, అంతర్రాష్ట్ర ముఠాల కదలికలపైనా నిఘా ఉంచాం. ద్విచక్రవాహనాలను ఆరుబయట కాకుండా ఇంటి ముందు ప్రహరీలు లేదా భద్రత ఉన్నచోట పార్కింగ్ చేసుకోవాలి.
-టి.శ్రీనివాసరావు, ఎస్పీ, జోగులాంబ జిల్లా

పటేల్ కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ


పటేల్ ప్రభాకర్‌రెడ్డితో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మల్దకల్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ నేత పటేల్ ప్రభాకర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల రోజుల కిందట పటేల్ ప్రభాకర్‌రెడ్డి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మాజీ మంత్రి కుర్తిరావల్‌చెర్వు గ్రామానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

కర్వెన జలాశయాన్ని పూర్తిచేయాలి: సీపీఎం

భూత్పూర్, న్యూస్‌టుడే: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న కర్వెన జలాశయాన్ని పూర్తి చేసి, సాగు, తాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. భూత్పూర్ పట్టణ పరిధిలోని అమిస్తాపూర్‌లో నిర్వహించిన మండల కార్యదర్శి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. నాయకులు కిల్లె గోపాల్, శ్రీశైలం, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కాకర్లపహాడ్ గ్రామ సమీపంలోని పర్వతాపురం మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ గ్రామాల భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ యూత్ సభ్యుల శ్రమదానం


స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో యువకులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పుట్టిన ఊరికి సేవ చేయాలనే తలంపుతో మొగిలి రావుల్ చెర్వు గ్రామంలో భగత్ సింగ్ యూత్ సభ్యులు శ్రమదానం చేశారు. ఇందులో విద్యార్థులు, వివిధ ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న సభ్యులతో పాటు గ్రామంలోనే స్థిర పడ్డ సుమారు 20 మందికిపైగా యూత్ సభ్యులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని పాఠశాల ఆవరణ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం యువతకు డైరీలు, టోపీలు, చిన్నారులకు పెన్నులు పంపిణీ చేశారు.

దేశభద్రతే ధ్యేయంగా పనిచేయాలి


అయిజలో కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

అయిజ, న్యూస్‌టుడే: దేశభద్రతే లక్ష్యంగా పనిచేయాలని ఆర్ఎస్ఎస్ వనపర్తి జిల్లా కార్యవహ నాగకృష్ణ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అయిజలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం, లక్ష్యాలు, నైతిక విలువలను ఆయన వివరించారు. అయిజ పట్టణంలో ఆర్ఎస్ఎస్ నాయకులు కవాతు నిర్వహించారు. పట్టణంలోని గద్వాల రహదారి సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం నుంచి మొదలైన కవాతు పాతబస్టాండు, అంబేడ్కర్ చౌక్, కొత్తబస్టాండు మీదుగా అక్షర పాఠశాలకు చేరుకున్నారు. అక్కడ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయిజ, మల్దకల్, గట్టు, రాజోలి నాలుగు మండలాలకు చెందిన ఆర్ఎస్ఎస్ నాయకులు సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు భరత్, నాగరాజు, రవి, తిమ్మప్ప పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. అమ్మో!



జోగులాంబ ఆలయాల దర్శనానికి వచ్చే భక్తులు తుంగభద్ర నది కరకట్టపై ప్రమాదకరంగా ఇలా నడుచుకుంటూ వెళ్తున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా ఇంకేమైనా ఉందా.. భక్తులు అలా వెళ్లకూడదని ప్రమాద హెచ్చరికలు సైతం ఇక్కడ ఏర్పాటు చేయలేదు. ఆదివారం కొంత మంది భక్తులు అలా నడుచుకుంటూ కొంత దూరం వెళ్లాక ఒకరు భయందోళనకు గురికాగా, మరో వ్యక్తి దగ్గరుండి వెనక్కి తీసుకొచ్చాడు. ఇలా కరకట్టపైకి వెళ్లకుండా ఏర్పాట్లు, హెచ్చరిక బోర్డులు పెట్టాలని భక్తులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, అలంపూర్

షెడ్లు నిరుపయోగం



గ్రామాల్లో ఉపాధి నిధులతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలో 11 గ్రామ పంచాయతీల్లో వీటిని నిర్మించారు. సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలి. మొదట్లో అడపాదడపా చేసినా, పంచాయతీ కార్యదర్శులు బదిలీ కావడం వచ్చిన వారు పట్టించుకోకపోవడంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రతి పంచాయతీలో తప్పనిసరిగా సెగ్రిగేషన్ షెడ్లను వినియోగించాలని, ఈ మేరకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఖాజామొహినుద్దీన్ అన్నారు. – న్యూస్‌టుడే, రాజోలి

నదిలోకి వ్యర్థాలు



తుంగభద్ర నదికి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. కాగా కొందరు వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ సీసాలు నదిలో పడేస్తున్నారు. ఆలయాలకు సమీపంలోని పుష్కర్‌ఘాట్ సమీపంలో భారీగా కన్పిస్తున్న ఈ చెత్తా చెదారం సాక్షిగా.. ఆహ్లాదకరంగా ఉండే నదీ ప్రవాహాన్ని చూడటానికి వచ్చే వారికి ఈ వ్యర్థాలు పంటి కింద రాయిలా తగులుతున్నాయి. ఆదివారం కన్పించిన ఈ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. –న్యూస్‌టుడే, అలంపూర్

వర్షాలతో పొగాకు పంటకు నష్టం



వర్షాలు ఎక్కువ కావడంతో అక్కడక్కడ పొగాకు పంటకు నీరు చిచ్చు పట్టింది. దీంతో మొక్కలు నేల చూస్తున్నాయి. వరుసగా మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో తగ్గు ప్రదేశంలో ఉన్న భూములకు ఈ నీరు చిచ్చు ప్రభావం నెలకొంది. మళ్లీ ఎండలు బాగా కాస్తే యథాస్థితికి వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. –న్యూస్‌టుడే, అలంపూర్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సన్మానం పొందిన గురువులతో పూర్వ విద్యార్థుల ఉత్సాహం

మానవపాడు, న్యూస్‌టుడే: మానవపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1989-90 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనాన్ని ఏర్పాటుచేశారు. ఈ వేడుకకు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఆయా రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకే వేదికపై సుమారు 34 ఏళ్ల తర్వాత కలుసుకొని తాము చదువుకున్న సమయంలో ఉన్న తీపి జ్ఞాపకాలను మరోసారి నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సీతారామయ్య, వెంకటాచలం, నాగన్‌గౌడ్, ఈశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శాంతిభూషణ్‌లను పూర్వవిద్యార్థులు శాలువ, పూలమాలతో సత్కరించారు. అంతకుముందు ఇటీవల మృతిచెందిన పూర్వ విద్యార్థులకు నివాళి అర్పించారు. ఎంఈవో శివప్రసాద్ పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తున్న సర్కారు'


అయిజలో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

అయిజ, మల్దకల్, ధరూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకుండా అన్నదాతలను మోసం చేస్తోందని నిరసిస్తూ భారాస రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం అయిజలోని పెట్రోల్‌బంక్ చౌరస్తాలో భారాస నాయకులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పుర ఛైర్మన్ దేవన్న, కౌన్సిలర్లు హుసేన్, వెంకటేశ్, ఆంజనేయులు, బీఆర్ఎస్వీ జిల్లా సమన్వయకర్త పల్లయ్య, నాయకులు రమేశ్, మహేశ్, పెద్దన్న, ఆంజనేయులు, వీరేశ్ పాల్గొన్నారు. ● కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల విషయంలో దాటవేత ధోరని అవలంబిస్తూ రైతులను మోసగిస్తోందని మల్దకల్ మండల భారాస నేతలు ఆరోపించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మల్దకల్ మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. పరశురాముడు, రాజునాయుడు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు. ● రైతు భరోసా ఖరీఫ్ సీజన్ సొమ్ము ఇవ్వలేమంటూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో భారాస రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా ధరూరు, కేటిదొడ్డి, గట్టు మండలాల పరిధిలో ఈపార్టీ నేతలు నిరసన కార్యక్రమాలు చేశారు. ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మల్దకల్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


కేటిదొడ్డిలో...

గుర్తు తెలియని మృతదేహం

అలంపూర్, న్యూస్‌టుడే: నది ఆవలి సుల్తానపురం పరిధిలోని తుంగభద్ర నది ఒడ్డున గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై వెంకటస్వామి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం నది ఎగువ నుంచి వచ్చిందా లేక ఇక్కడే పడి ఉందా అన్న విషయమై పరిశీలన చేస్తున్నారు. మృతదేహం గుర్తు పట్టని విధంగా ఉండటంతో అలంపూర్ ఆసుపత్రి నుంచి వైద్యుడిని తీసుకెళ్లి శవ పరీక్ష నిర్వహించినట్లు ఎస్సై వివరించారు.

కోదండాపురంలో గుడిసె దగ్ధం

ఇటిక్యాల, న్యూస్‌టుడే: కోదండాపురం గ్రామంలో శనివారం రాత్రి గుడిసె దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్ గ్రామంలోనే గుడిసెలో హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకుంది. గ్రామస్థులు గమనించే సరికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. హోటల్ పక్కనే ఉన్న బోర్ల సాయంతో మంటలు వ్యాపించకుండా గ్రామస్థులు నియంత్రించారు. గుడిసెలో రెండు సిలిండర్లున్నా అవి పేలకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. గుడిసెలోని ఫ్రిజ్, ఫర్నిచర్, రూ.5 వేల నగదు, వంట సామగ్రి అంతా కలిసి సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితుడు వాపోయాడు. ఆర్ఐ శ్రీనివాస్ పంచనామ నిర్వహించారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్ యాదవ్ ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచి సుంకన్న, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు, తిరుపతి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇటిక్యాల, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. ఇటిక్యాల పోలీసులు శనివారం అర్ధరాత్రి గస్తీ నిర్వహిస్తుండగా కొండపేట శివారులో ఒకటి, ఎర్రవల్లి సమీపంలో జాతీయ రహదారిపై మరో ట్రాక్టర్‌ను గుర్తించారు. ట్రాక్టర్లను ఇటిక్యాల పోలీసు స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకం


జడ్చర్ల: హోమం చేస్తున్న భక్తులు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే: జడ్చర్ల మండలంలోని కుర్వగడ్డపల్లి గ్రామ పంచాయతీలోని మీనాంబరం పరుసవేదీశ్వస్వామి ఆలయంలో ఆదివారం రుద్రాభిషేకం, రుద్ర హోమం, గణపతిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం అగ్నిగుండ మహోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. అగ్నిగుండ మహోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ జ్యోతి, ఆలయ కమిటీ సభ్యులు కైలాస్ జువార్, శంకరప్ప, భద్రప్ప, బుచ్చప్ప, శ్రీశైలం, శ్రీనివాసులు, పర్వతాలు పాల్గొన్నారు.

ఏ దారెటు వెళ్తుందో ఎవరికి ఎరుక!



మానవపాడు శివారులోని రైల్వే ట్రాక్ వద్ద రెండేళ్ల కిందట రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించారు. అటువైపు 44వ జాతీయ రహదారి ఉండటంతో నిత్యం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఆర్‌యూబీ మీదుగా మానవపాడు శివారులోని రైల్వే స్టేషన్‌కు, జాతీయ రహదారి వైపు చేరుకునేందుకు రెండు మార్గాలున్నాయి. ఏ దారి ఎటు వెళ్తుందో తెలిపేలా సూచికబోర్డు ఏర్పాటు చేయలేదు. అంతే కాకుండా రాత్రివేళ ఆర్‌యూబీ మీదుగా ప్రయాణించేందుకు చీకటిగా ఉండటంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఆర్‌యూబీ వద్ద వీధీదీపాలు, నిఘానేత్రాలు ఏర్పాటుచేయాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మానవపాడు

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పట్టణం శ్రీనివాసకాలనీలోని శ్రీవల్లి దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వివిధ దేవతామూర్తుల విగ్రహాలు కొలువుదీరాయి. మూడు రోజుల పూజల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బ్రహ్మాండం గురునాథశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం మంత్రోచ్ఛరణ మధ్య నాగదేవత, నవగ్రహాలు, పంచనాగులు, సంతాననాగులు విగ్రహాలను ప్రతిష్ఠించారు. అభిషేకాలు, హోమాలు, యంత్ర తర్పణం, యంత్ర ప్రతిష్ఠ అనంతరం విగ్రహ ప్రతిష్ఠలు చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం కొనసాగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

అయిజ, అలంపూర్, న్యూస్‌టుడే: గద్వాలలో ఈనెల 25, 26వ తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం అయిజలోని సీపీఎం కార్యాలయం వద్ద ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ఆయన సీపీఎం జెండాను ఆవిష్కరించి కరపత్రాలను విడుదల చేశారు. సీపీఎం నాయకులు ఈశ్వర్, వీరేశ్, సవారి, పెద్దరాముడు, మద్దిలేటి, నాగరాజు, వీరేశ్, తిరుమలేశ్ పాల్గొన్నారు. ● క్యాతూర్ గ్రామ కార్యదర్శిగా బంగారు రఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ సభ్యులు రాజు, ఈదన్న తెలిపారు. క్యాతూర్ గ్రామంలో సీపీఎం మూడో గ్రామసభ నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాజు మాట్లాడుతూ రాబోయే మూడేళ్ల కాలంలో ప్రజలు, రైతులు, కార్మికులు మహిళలు, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. జిల్లా మహాసభలకు పార్టీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ సభ్యులు రామాంజనేయులు, రజాక్, రాము, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నాటుతున్నారు.. వదిలేస్తున్నారు!


ఎండిపోయిన మొక్కలు

అలంపూర్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా అలంపూర్ పురపాలిక పరిధిలో మొక్కలు నాటించారు. సెప్టెంబరు 23వ తేదీ నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు పెట్టించారు. ఇమాంపురం వద్ద నాటించిన మొక్కలు అప్పుడే వాడిపోయాయి. మొక్కలు నాటించడం వరకే అధికారులు చూస్తున్నారు తప్ప వాటి సంరక్షణ గాలికి వదిలేస్తున్నారు. దీంతో నాటిన మొక్కలు చాలా మేరకు ఎండిపోవడం, వాటి చుట్టూ పిచ్చి మొక్కలు మొలవడం, నాటిన మొక్కలకు సరైన ఆధారం లేకపోవడంతో గాలికి వాలిపోతున్నాయి. పెద్ద మొత్తంలో ప్రభుత్వం డబ్బులు వెచ్చిస్తుందే తప్ప వాటిని పట్టించుకునే వారు లేకపోవడం గమనార్హం. అలంపూర్ నుంచి ఇమాంపురం వరకు అనేక పర్యాయాలు మొక్కలు పెడుతూనే ఉన్నారు. అక్కడక్కడా మొక్కలు పెరగటం తప్ప పూర్తి స్థాయిలో మొక్కలు రావటం లేదు. రక్షణ ఏర్పాట్లు సైతం చేయడంలేదు. ఉపాధిహామీ పనులు పురపాలికలో లేకపోవడంతో మొక్కల సంరక్షణను సైతం పట్టించుకునే వారు కరవయ్యారు. పుర ఛైర్పర్సన్ మనోరమ దృష్టికి తీసుకవెళ్లగా తప్పని సరిగా పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం అవకాశం లేకపోవడంతో ట్రీ గార్డ్సు పెట్టడం లేదన్నారు.